క్లుప్తంగా

25న డీఎస్సీ ఉచిత మోడల్ గ్రాండ్ టెస్ట్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): యంగ్‌మైండ్ రేపటి తరం కోసం సంస్థ ఆధ్వర్యంలో మే 25వ తేదీ మధ్యాహ్నం డీఎస్సీ ఉచిత మోడల్ గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు వాకాడ వెంకటరమణ ఆదివారం తెలిపారు. స్థానిక విద్యుత్ నగర్‌లోని శ్యామ్ ఇన్‌స్టిట్యూట్‌లో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు తయారు చేసిన మోడల్ పేపర్ ఉంటుందని చెప్పారు. దీని ద్వారా అభ్యర్థులు తమ ప్రతిభను బేరీజు వేసుకోవచ్చన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు 93462 87425 నంబరుకు వాట్సాప్ ద్వారా వివరాలు పంపించాలని కోరారు.

జీజీహెచ్‌కు మాస్కుల అందజేత



మాస్కులు అందుకుంటున్న డాక్టర్ విఠల్

కాకినాడ క్రైం: కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్ జీజీహెచ్‌కు ఎన్–95 మాస్కులు అందజేశారు. ఆదివారం వీటిని ఆయన తరఫున ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు రావు సత్య గోపాల్ అక్షయ్ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్‌కు ఆయన కార్యాలయంలో అందజేశారు. కోవిడ్ ఉనికి నేపథ్యంలో రోగులు, వైద్య, వైద్యేతర సిబ్బందికి మాస్కులు మేలు చేస్తాయని డాక్టర్ విఠల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ ఎస్.శ్రీధర్, ఏఆర్ఎంవో లావణ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నియోజకవర్గ మహానాడు

కాకినాడ సిటీ: నగరంలో టీడీపీ కాకినాడ సిటీ నియోజకవర్గ మహానాడు కార్యక్రమం ఆదివారం స్థానిక సూర్య కళా మందిరంలో జరిగింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, నియోజకవర్గ పరిశీలకులు దేశంశెట్టి వెంకట లక్ష్మీనారాయణ, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు వివరించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

తాళ్లరేవు: తిరుపతిలో దళిత విద్యార్థిని కిడ్నాప్ చేసి, హత్యాయత్నానికి పాల్పడిన దోషులను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు కోరారు. తిరుపతిలోని ఓ కళాశాలలో ఇంజినీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్న జేమ్స్ అనే దళిత విద్యార్థిని చంపేందుకు యత్నించడం దారుణమైన చర్యన్నారు. ఈ దుర్మార్గానికి పాల్పడిన రౌడీషీటర్ సాయి రూపేష్, బోటా బ్లేడ్ గ్యాంగ్‌లపై కేసులు నమోదు చేయాలని, జేమ్స్‌కు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. దళిత విద్యార్థిపై దాడిని విశ్వజన కళామండలి తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

రేపు ఎన్‌హెచ్‌పై ఆక్రమణల తొలగింపు

తాళ్లరేవు: జాతీయ రహదారి (ఎన్‌హెచ్) 216 చెంతన ఉన్న ఆక్రమణలను ఈ నెల 20న తొలగిస్తామని తహసీల్దార్ పితాని త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని చొల్లంగి నుంచి సుంకరపాలెం వరకు రహదారి చెంతన పలువురు ఆక్రమించుకుని, అక్రమ నిర్మాణాలు, వ్యాపార దుకాణాలు ఏర్పాటు చేసినట్లు ఫిర్యాదు అందడంతో సంబంధిత అధికారులు వాటి తొలగింపునకు చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో రహదారిని ఆనుకుని, ఆక్రమించి చేసిన నిర్మాణాలన్నింటినీ 20వ తేదీలోపు స్వచ్ఛందంగా తొలగించాలని, లేని పక్షంలో నేషనల్ హైవే అథారిటీ వారు పోలీసుల సహకారంతో ఆక్రమణలు తొలగిస్తారని చెప్పారు. ఆక్రమణల తొలగింపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తహసీల్దార్ కోరారు.

సినిమాలు



ఆనంద్ సినిమాస్:	ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్, లవ్‌లీ, శుభం
దేవీ మల్టీప్లెక్స్:	సింగిల్, శుభం, ఎలెవెన్
లక్ష్మి:	మిషన్ ఇంపాజిబుల్
సత్యగౌరి:	ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్
తిరుమల:	23
సీఅండ్‌సీ:	ఫైనల్ డెస్టినేషన్ బ్లడ్ లైన్స్
సీఅండ్‌సీ–2:	హిట్ ది థర్డ్ కేస్
శ్రీప్రియ:	మిషన్ ఇంపాజిబుల్
పద్మప్రియ:	సింగిల్

కూల్ అవ్వాల్సిందే..

- వామ్మో.. వడగాడ్పులు, ఉక్కపోత
- వేడిమిని తట్టుకోలేకపోతున్న జనం
- ఏసీలు, కూలర్లకు పెరిగిన గిరాకీ
- దుకాణాలకు కొనుగోలుదార్ల క్యూ



షోరూమ్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఏసీలు

బోట్‌క్లబ్: భానుడి భగభగలకు ప్రజలు అల్లాడిపోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కాకినాడ నగరంలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో ప్రజలు వేడితాపానికి తట్టుకోలేకపోతున్నారు. ఉదయం 9 గంటల నుంచి ఇంటిలో ఫ్యాన్లు వేసుకున్నా వేడిగాలులతో అల్లాడుతున్నారు. కుళాయిలు నుంచి వచ్చే నీరు కూడా వేడిగా ఉండడంతో ప్రజలు రిఫ్రిజిరేటర్లను భారీగా కొనుగోలు చేస్తున్నారు. వేడిగాలులు, ఉక్కపోత కారణంగా ప్రజలు ఏసీల కోసం షోరూమ్‌లకు క్యూలు కడుతున్నారు.

నగరంలో ఆదివారం 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వారం రోజులుగా 36, 37 డిగ్రీలు తగ్గకుండా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేడి గాలులు తక్కువగా ఉన్నా.. ఉక్కపోత చాలా ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఏసీలు కొనేందుకు పరుగులు పెడుతున్నారు. ఏసీలు కొనలేని పేదలు మాత్రం కూలర్లను కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ఏసీలు, కూలర్ల కొనుగోలుకు ఆసక్తి చూపుతుండడంతో.. నగరంలోని పలు దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. ఒక్కసారిగా కొనుగోలుదారులు ఎగబడడంతో.. షాపుల యజమానులు అదనుచూసి ఏసీలు, కూలర్లు, రిఫ్రిజిరేటర్ల రేట్లు కూడా పెంచుతున్నారు. దీపం ఉండగా ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా, డిమాండ్ ఉండడంతో రేట్లు గణనీయంగా పెంచుతున్నారు. ఎండాకాలంలో ఫుల్‌గా స్టాక్ పెట్టుకున్నా.. డిమాండ్ ఉండడంతో అధిక రేట్లకు విక్రయించేందుకు స్టాక్ లేదని కొందరు వ్యాపారులు ఇదే అదనుగా దోచుకుంటున్నారు.

పెరిగిన విక్రయాలు

కాకినాడ నగరంలో 12 పెద్ద షోరూమ్‌లు, 45కి పైగా చిన్న ఏసీ షోరూమ్‌లు ఉన్నాయి. పెద్ద షోరూమ్‌లో ప్రతి రోజు 15 నుంచి 20 వరకూ ఏసీలు, చిన్న షోరూమ్‌లో 10 నుంచి 15 వరకూ ఏసీలు అమ్ముడవుతున్నాయంటే, ప్రస్తుతం ఎండ వేడి ఎలా ఉందో వేరే చెప్పనవరం లేదు. ఈ నెల తొలి వారంలో కాకినాడ నగరంలోని అన్ని షోరూమ్‌లో కలిపి 100 నుంచి 120 ఏసీలు మాత్రమే విక్రయించేవారు. ప్రస్తుతం 500 నుంచి 600 ఏసీలు విక్రయిస్తున్నట్టు వ్యాపార వర్గాలు పేర్కొన్నాయి.

ఈ ఏడాది తక్కువే!

గత ఏడాది కాకినాడ నగరంలో 38 నుంచి 41 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు అధికంగా ఏసీలు, కూలర్లు కొనుగోలు చేశారు. ప్రస్తుతం మే నెల మొదటి వారంలో వర్షాలు పడడంతో.. గత ఏడాదితో పోల్చితే ఈసారి అమ్మకాలు తగ్గాయని పలువురు షోరూం యజమానులు చెబుతున్నారు.

మధ్య తరగతి ప్రజలు సైతం..

ఒకప్పుడు ధనవంతులు మాత్రమే ఏసీలు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం సులభ వాయిదా పద్ధతులు షోరూమ్‌ల్లో అందుబాటులో ఉండడంతో సాధారణ, మధ్య తరగతి ప్రజలు సైతం ఏసీలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో విక్రయాలు అనుకున్న దానికన్నా ఎక్కువగా ఉండడంతో షోరూమ్ యజమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ నగరంలో సుమారు ఐదు లక్షల మంది జనాభా ఉన్నారు. కాకినాడ రూరల్‌లో మూడు లక్షలకు పైగా జనాభా ఉన్నారు. వీరిలో 30 శాతం మంది మాత్రమే ప్రస్తుతం ఏసీ వినియోగిస్తున్నారు. మిగిలిన 70లో 50 శాతం మంది కేవలం కూలర్లతో సరిపుచ్చుకొంటున్నారు.

టెక్నీషియన్లకు డిమాండ్

వేలాది రూపాయలు పెట్టి ఏసీ కొనుగోలు చేసిన వాటిని ఏసీ టెక్నీషియన్లే వచ్చి ఇంటి వద్ద బిగించాలి. రోజుకు వందల కొద్దీ ఏసీలు విక్రయిస్తున్న షోరూమ్ యజమానులు వాటిని బిగించేందుకు టెక్నీషియన్లు దొరక్కపోవడంతో తలలు పట్టుకొంటున్నారు. ఏసీలు కొనుగోలు చేసిన వారు ఈరోజే ఏసీ బిగించాలని పట్టుబట్టడంతో ఏసీ టెక్నీషియన్లకు గిరాకీ పెరిగింది. సాధారణ రోజుల్లో టెన్నీషియన్‌కు రూ.500 ఇస్తే.. ప్రస్తుతం రూ.వెయ్యి డిమాండ్ చేస్తున్నారు.

వేడి తట్టుకోలేకపోతున్నాం



ఈ ఏడాది ఏసీ కొనుగోలు చేద్దామనుకున్నాను. కానీ డబ్బు చాలకపోవడంతో వచ్చే ఏడాది కొందామనుకున్నాను. ఈమధ్య వేడిగాలులు ఎక్కువయ్యాయి. ప్రైవేటు కంపెనీలో పనిచేస్తాను. రాత్రి ఇంటికొచ్చి పడుకున్నా ఫ్యాన్ గాలి వేడిగా రావడం, ఉక్కపోత కారణంగా నిద్ర పట్టడం లేదు. తప్పని పరిస్థితుల్లో ఫైనాన్స్‌పై ఏసీ కొనుగోలు చేశాను.

– గొల్లపల్లి శివ, కాకినాడ

డిమాండ్ బాగుంది

గత వారంలో వర్షం కురవడంతో అమ్మకాలు బాగా తగ్గిపోయాయి. ప్రస్తుతం ఎండలు, ఉక్కపోత కారణంగా ఏసీలు, రిఫ్రిజిరేటర్లు సైతం బాగానే అమ్ముడవుతున్నాయి. చేతిలో డబ్బు లేకపోయినా, ఫైనాన్స్ సదుపాయం ఉండడంతో వినియోగదారులు ఏసీలు, కూలర్లు కొనుగోలు చేసే వెళుతున్నారు.

– వి.శ్రీనివాస్, మేనేజర్, ఏసీల షోరూం

విద్యా వ్యవస్థ ఘనత మనదే..



ప్రసంగిస్తున్న కాశీభొట్ల సత్యనారాయణ

బోట్‌క్లబ్: దేశంలో మొట్టమొదటి రిగా విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేసి, విద్యా వ్యవస్థను ప్రపంచానికి పరిచయం చేశామని ప్రముఖ సాహితీవేత్త కాశీభొట్ల సత్యనారాయణ తెలిపారు. అచ్యుతాపురం గేటు సమీపంలోని సరస్వతీ విజ్ఞాన వేదికలో ఆదివారం ఆస్వాదన సాహితీ సమితి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. సమితి వ్యవస్థాపకులు గొట్టుముక్కల వేంకట సత్యనరసింహశాస్త్రి మాట్లాడుతూ, లోకంలో ఉన్న విషయాలన్నీ పురాణాల్లో ఉన్నాయని, లోకంలో లేనివి పురాణాల్లో లేవన్నారు. భారతరామాయణభాగవతాలు, శ్రీదేవీ భాగవత పురాణంలో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా శ్రీదేవీ భాగవతాన్ని కాశీభొట్ల విశ్లేషణ చేశారు. నైమిషారణ్యం, నలందా తక్షశిల విశ్వవిద్యాలయాల వైభవాన్ని చెబుతూ, రుషులు కులపతులన్నారు. ఆనాటి ప్రముఖులు సూత మహర్షి తదితరులతో ముడిపడిన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ జ్యోతిష శాస్త్ర పండితులు సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి, గిడుగు వేంకటాచలపతి, నిట్ల సత్యనారాయణ మూర్తి, నేతి వెంకటరమణ, పెండ్యాల హృషికేష్ శర్మ, సాహితీ ప్రియులు, పండితులు పాల్గొన్నారు.

ఉద్యోగ కల్పనలో అగ్రగామి

- 2024–25కి 1,507 ప్లేస్‌మెంట్ ఆఫర్లు
- గరిష్టంగా ఇద్దరికి రూ.40 లక్షల ప్యాకేజీ
- 'ప్రగతి' ఛైర్మన్ కృష్ణారావు



టి.సహాన



ఎస్ఎండీ ఆషిక్ ఇలాహి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంజినీరింగ్ అఖరి సంవత్సరం పూర్తయ్యేలోపు పట్టాతో పాటు, ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల(అటానమస్) కృషి చేస్తుందని కళాశాల ఛైర్మన్ పరుచూరి కృష్ణారావు అన్నారు. 2024–25 ఏడాదికి సంబంధించి 54 ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీల్లో 1,507 ప్లేస్‌మెంట్ ఆఫర్లు సాధించారని చెప్పారు. ఆటోడెస్క్ నుంచి టి.సహాన, ఎస్ఎండీ ఆషిక్ ఇలాహికి ఏడాదికి రూ.40 లక్షల ప్యాకేజీతో పాటు, సర్వీస్ నౌ సంస్థ నుంచి రూ.34.5 లక్షల ప్యాకేజీతో మరో ఇద్దరు ఉద్యోగాలు సాధించారన్నారు. అమెజాన్ ఇంటర్న్‌షిప్ రూ.50 వేల నుంచి రూ.70 వేల నెలవారీ స్టైఫండ్‌తో పాటు, రూ.30 లక్షల ప్యాకేజీతో 11 ఆఫర్లు వచ్చాయని, దేశంలో ఏ విద్యాసంస్థ ఇన్ని ఆఫర్లు పొందలేదని వివరించారు. ప్రముఖ కంపెనీలు టెక్ మహీంద్ర 267, ఇన్ఫోసిస్ 110, టీసీఎస్ 55, హెచ్‌సీఎల్ 51, డెలాయిట్ 41, విప్రో 25 ఆఫర్లు కల్పించాయన్నారు. సర్వీస్‌నౌ సంస్థలో ముగ్గురు ఇంటర్న్‌షిప్ పొందగా, ద్వితీయ సంవత్సర విద్యార్థి ఒకరు ఉబర్ సీప్లస్‌ప్లస్ ద్వారా ఇంటర్న్‌షిప్ పొందారన్నారు. ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) వర్చువల్ ఇంటర్న్‌షిప్స్ ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల జాతీయ స్థాయిలో ఒకటో ర్యాంక్ సాధించిందని తెలిపారు. అకడమిక్స్, డిసిప్లిన్, ప్లేస్‌మెంట్లకు అగ్రగామిగా ప్రగతి నిలుస్తుందన్నారు. కళాశాల విద్యా విధానం, మౌలిక వసతులు, ల్యాబ్స్ వంటి వాటి పరిశీలనకు తమ క్యాంపస్‌ను సంప్రదించవచ్చన్నారు. కౌన్సెలింగ్ సమయంలో ఈఏపీసెట్ కోడ్‌తో అడ్మిషన్ పొందవచ్చని చెప్పారు. వివరాలకు 73308 26667 నంబరుకు సంప్రదించవచ్చని తెలిపారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాలకు అధ్యక్షులు వీరే..

బోట్‌క్లబ్: వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ నియోజకవర్గ అనుబంధ విభాగాలకు అధ్యక్షులు నియమితులయ్యారు. యూత్ విభాగానికి రోకళ్ల సత్యనారాయణ, మహిళా విభాగానికి పుసుపులేటి వెంకటలక్ష్మి, బీసీ సెల్‌కు వాసుపల్లి కృష్ణ, ఎస్సీ సెల్‌కు బళ్ల సూరిబాబు, మైనార్టీ సెల్‌కు ఖరీద్ బిన్ వల్లీ, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు పి.కృపానందం, విద్యార్థి విభాగానికి జలగడపుల పృథ్వీ, మున్సిపల్ విభాగానికి కంపర అప్పారావు(బాబి), ఆర్టీఐ విభాగానికి గండేపల్లి దాసు, వలంటీర్ల విభాగానికి మన్యం దుర్గాసుభద్ర, గ్రీవెన్స్ సెల్‌కు నల్లబిల్లి సుజాత, వాణిజ్య విభాగానికి కాకరపర్తి హరినాథ్, వీవర్స్ విభాగానికి పాడిశెట్టి సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ టీయూసీకి చిక్కాల సుధాకర్, అంగన్‌వాడీ విభాగానికి కర్రి అనంత, లీగల్ సెల్‌కు పితాని శ్రీనివాస్, కల్చరల్ విభాగానికి చెక్కా భాగ్యలక్ష్మి, సోషల్ మీడియా విభాగానికి పుట్టేపు హేమంత్ కుమార్, ఐటీ విభాగానికి మీల నికేష్, మేధావి విభాగానికి అవసన అనంతలక్ష్మి, బూత్ కమిటీ విభాగానికి బెజవాడ గణేష్(బాబి), ప్రచార విభాగానికి మన్యం డీవీ ప్రసాద్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. ఆయా విభాగాలకు అధ్యక్షులుగా నియమితులైన వారిని కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

'రియల్'లో అవగాహన సదస్సులు అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ మురళీకృష్ణ

- జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ మురళీకృష్ణ

బోట్‌క్లబ్: రోజురోజుకూ భవన నిర్మాణ, లేఅవుట్ అభివృద్ధి ప్రాజెక్టులు కుంటుపడుతున్న తరుణంలో రియల్ ఎస్టేట్ రంగాల్లో ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు నారెడ్కో వంటి సంస్థలు బిల్డర్లకు అవగాహన సదస్సులు నిర్వహించాలని జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. స్థానిక జేఎన్‌టీయూకేలో ఆదివారం నారెడ్కో (నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్) ఆధ్వర్యంలో రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్–ఖర్చు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. రోజురోజుకూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా బిల్డర్లు ఒకరికొకరు పోటీ పడి, రేట్ల విషయంలో రాజీ పడి నష్టాల బారిన పడుతున్నారన్నారు. నారెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర రావు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణం, రియల్ ఎస్టేట్ రంగాలకు లాభం చేకూర్చేలా తీసుకొస్తున్న నూతన చట్టాలపై సభ్యులకు అవగాహన అవసరమన్నారు. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు నిర్వహణ–ప్రాజెక్టు విజయవంతం చేయడం, ప్రాజెక్టు ఖర్చులపై నారెడ్కో కాకినాడ చాప్టర్ అధ్యక్షుడు పేర్ల వెంకట వేణుగోపాలరావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో నారెడ్కో సెక్రటరీ ఉపేష్, ట్రెజరర్ నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ దండెం రామకృష్ణ, ఉపాధ్యక్షులు వీవీ రమణమూర్తి పాల్గొన్నారు.

వ్యాక్సిన్‌తో హెచ్ఐవీ నియంత్రణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సత్యనారాయణ

కాకినాడ రూరల్: శాస్త్రవేత్తల కృషి ఫలితంగా అందుబాటులోకి వచ్చిన హెచ్ఐవీ వ్యాక్సిన్ వినియోగంతో వ్యాధిగ్రస్తులకు ఎయిడ్స్ అదుపులోకి వస్తుందని ఐడీఏ రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. హెచ్ఐవీ వ్యాక్సిన్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా 39.9 మిలియన్ల మంది హెచ్ఐవీతో కాలం వెళ్లదీస్తుండగా, 1.3 మిలియన్ల కొత్త ఇన్ఫెక్షన్లు నమోదయ్యాయని వివరించారు. కౌమార దశలో 80 వేల మంది పిల్లలు హెచ్ఐవీతో జీవిస్తున్నారన్నారు, అంతర్జాతీయ ఆర్థిక సహకారంతో అధిక మొత్తం నిధులు వెచ్చించి హెచ్ఐవీ వ్యాక్సిన్‌ను కనుగొన్నారని చెప్పారు. రోగ నిరోధక కణాల్లోకి హెచ్ఐవీ వైరస్ ప్రవేశించకుండా ఈ వ్యాక్సిన్ నిరోధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, కర్నాసుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ జాతీయ సమితి సభ్యుడిగా బాబీ



కాకినాడ సిటీ: తిరుపతిలో గురువారం నుంచి నాలుగు రోజుల పాటు జరిగిన అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభల్లో సంఘ జాతీయ సమితి సభ్యుడిగా కాకినాడకు చెందిన వై.బాబీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2007 నుంచి విద్యార్థి, యువజన ఉద్యమాల్లో ఈయన అనేక పోరాటాలు చేశారు. యువజన ఉద్యమాల్లో నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతున్న బాబీకి ఈ పదవి లభించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

హెచ్ఐవీ బాధితులను ఆదరించాలి

తాళ్లరేవు: సమాజంలో హెచ్ఐవీ సోకిన బాధితులను ఆదరించాలని, సహాయ సహకారాలు అందించాలని భీమాబాయి మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన అన్నారు. ఆదివారం భీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నందివర్ధన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఏటా మే నెల మూడవ ఆదివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. ఎయిడ్స్‌తో మరణించిన వారిని గుర్తు చేసుకోవడంతో పాటు హెచ్ఐవీ బాధితులకు భరోసా అందించడం ఈ కార్యక్రమం నిర్వహణ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి సిబ్బంది పాల్గొన్నారు.

అన్న సమారాధన

తాళ్లరేవు: గ్రామ ప్రధాన రహదారిలో ఉన్న భూసమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఘనంగా ముగిసిన నేపథ్యంలో ఆదివారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ కొత్త సుభాష్, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మురికికూపంగా పారిశ్రామిక వాడ..!



రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో నీటి గుంతలా ఉన్న రోడ్డుపై వెళుతున్న ట్రాక్టర్

- రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో రోడ్డుపైనే మురుగు

కాకినాడ రూరల్: ఈ చిత్రంలో కనిపిస్తున్న రోడ్డు, డ్రైనేజీ రమణయ్యపేటలోని ఏపీఐఐసీ పారిశ్రామిక వాడలోనిది. మురికికూపంలా మారడంతో ఈ మార్గంలో వెళ్లేవారు ముక్కున వేలు వేసుకోవాల్సి వస్తోంది. గంగరాజు రోడ్డు నంబరు–4 వద్ద వినాయకుడి గుడి పక్క నుంచి కాకినాడ–పిఠాపురం రోడ్డు వరకు విస్తరించి ఉన్న ఈ మార్గంలో ఏపీఐఐసీ కాలనీలో రోడ్డుపై పెద్ద గొయ్యి ఏర్పడింది. కొద్దిపాటి వర్షానికి నీరు నిలిచి దిచక్ర వాహనాలు వెళ్లలేని పరిస్థితి. పక్కనే ఉన్న డ్రైనేజీ మురుగుతో కంపు కొడుతోంది. నీరు పారేందుకు వీల్లేకుండా ఉంది. ఏపీఐఐసీ జోనల్ కార్యాలయం రమణయ్యపేటలోనే ఉండడంతో అధికారులు పరిశీలించి, సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న డ్రైనేజీ

నేడు శ్యామ్‌బాబు సంస్మరణ సభ



సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కాకినాడ సిటీ: మాదిగ జాతి అభ్యున్నతికి అలుపెరుగని పోరాటం చేసిన కొండేపూడి శ్యామ్‌బాబు మాదిగ సంస్మరణ సభ సోమవారం స్థానిక ఎస్.అచ్యుతాపురంలోని ఆయన ఇంటి వద్ద జరుగుతుందని, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ సభలో పాల్గొంటారని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ నాయకుడు ముమ్మిడివరపు చినసుబ్బారావు మాదిగ తెలిపారు. నగరంలోని లేడీస్ క్లబ్ వద్దనున్న పార్కు ఆవరణలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథి చినసుబ్బారావు మాదిగ మాట్లాడుతూ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులుగా పని చేసిన కొండేపూడి శ్యామ్‌బాబు మాదిగ ఇటీవల పరమపదించిన నేపథ్యంలో మంద కృష్ణ మాదిగ ఆయన కుటుంబాన్ని పరామర్శిస్తారన్నారు. తొలుత నగరంలో భారీ ర్యాలీ నిర్వహించి, దివంగత శ్యామ్‌బాబు మాదిగ ఇంటికి చేరుకుంటారన్నారు. సంస్మరణ సభ అనంతరం కాకినాడ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను ఏర్పాటు చేస్తారన్నారు. ఎంఎస్పీ జిల్లా నాయకులు వల్లూరి సత్తిబాబు, వీరబాబు, పలివెల నవీన్, కాకాడ నూకరాజు పాల్గొన్నారు.

ఘనంగా.. తిరంగా..



సర్పవరం జంక్షన్‌లో నిర్వహిస్తున్న తిరంగా ర్యాలీ

కాకినాడ రూరల్: భారత సైన్యానికి మద్దతుగా బీజేపీ ఆధ్వర్యంలో కాకినాడ రూరల్‌లో ఆదివారం సాయంత్రం తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పవరం జంక్షన్ నుంచి పిఠాపురం రోడ్డు మీదుగా ఏపీఐఐసీ కాలనీ ఆంజనేయ స్వామి ఆలయం వరకు జాతీయ జెండాను చేతపట్టుకుని, జై భారత్ అంటూ నినాదాలు చేసుకుంటూ ర్యాలీ నిర్వహించారు. భరత మాత, సైకిల్ వేషధారణతో పలువురు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



సంత మార్కెట్ వద్ద నాలుగు రోడ్ల కూడలి

సామర్లకోట: పట్టణంలోని సంతమార్కెట్ కూడలి ప్రదేశంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. సంత మార్కెట్ నుంచి పోలీసు స్టేషన్, సీహెచ్‌సీ నుంచి పాత తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే నాలుగు రోడ్ల కూడలి ప్రదేశాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా మార్గాలు సీసీ రోడ్లు కావడంతో వాహన చోదకులు వేగంగా రాకపోకలు సాగిస్తున్నారని, దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఎమ్మార్పీఎస్ నాయకుడు దూలపల్లి రాజు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు స్టేషన్ వైపు నుంచి వచ్చే వాహనాలకు పాత తహసీల్దార్ కార్యాలయం రోడ్డు నుంచి వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో, తరచూ వాహనాలు ఢీకొంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీనికి తోడు కోట్లమ్మ చెరువు వద్ద పాత తహసీల్దార్ కార్యాలయ రోడ్డులో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయడం వల్ల కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేయడం ప్రమాదాలకు దారితీస్తోంది. సంత మార్కెట్ ప్రదేశంలో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేసుకోవాల్సి ఉండగా, రోడ్డు మార్జిన్‌లో ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంతం ప్రమాదాలకు నిలయంగా మారిందనే విమర్శలున్నాయి. కూరగాయల దుకాణాలను రోడ్డు మార్జిన్ నుంచి తొలగించి, సంత మార్కెట్‌లో ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసుకునేలా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కూరగాయల షాపులపై అనేక పర్యాయాలు కౌన్సిల్ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా మున్సిపల్ అధికారులు స్పందించలేదని కౌన్సిలర్ నేతల హరిబాబు ఆరోపించారు.